

పతాకావిష్కరణ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుదాం

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేద్దాం
- 79వ స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి మండిపల్లి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుదామని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేద్దామని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖామంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య వేడుకలు స్థానిక పోలీస్ పేరెడ్‌గ్రౌండులో శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో అన్నమయ్య జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 93 శాతం స్ట్రైకింగ్‌తో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారన్నారు. రాష్ట్రం పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల అమలు, లక్ష్యసాధనలో విశేషంగా కృషి చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఆయన ఆధ్వర్యంలో పనిచేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా యంత్రాగాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ.. 2024 ఎన్నికల సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు.. అధికారం చేపట్టిన తొలిరోజే మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిల్‌యాక్ట్ రద్దు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై సీఎం తొలిసంతకాలు చేసి ప్రజల పట్ల తనకున్న విశ్వసనీయతను చాటుకున్నారన్నారు. ఇందులో భాగంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలను అర్హులైన రైతులకు అందిస్తోంది. ఈ పథకం కింద జిల్లాలో ఒక లక్షా 88 వేల 408 మంది రైతుల ఖాతాల్లో రూ.127 కోట్ల 88 లక్షలు జమ చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు తెలిపారు. పీ4 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 62 వేల 182 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తయింది. తల్లికి వందనం పథకం ద్వారా జిల్లాలో 2 లక్షల 33 వేల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.283 కోట్లు జమ చేశాం. మహిళల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యతనిచ్చి ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఎన్టీఆర్ భరోసా పింఛన్ ద్వారా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పు కళాకారులు, హిజ్రాలు, హెచ్ఐవీ బాధితులు, కళాకారులకు మేలు చేశాం. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో సుమారు 300కు పైగా పౌరసేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

త్యాగధనులను స్మరించుకుందాం

మన జాతిపిత మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్, డాక్టర్ బాబుజగజ్జీవన్‌రాం, జ్యోతిరావుఫూలే, అల్లూరి సీతారామరాజు, కొమరంభీమ్‌లతో పాటు ఎందరో అమరవీరులు చేసిన ఎనలేని త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. బ్రిటీష్ పాలన విముక్తి కోసం పోరాడి ప్రాణాలర్పించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, స్వాతంత్ర్యం పోరాటంలో పాల్గొన్న జిల్లాకు చెందిన ఈ ప్రాంత వాసులు యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి, బి.చెంద్రాయుడు, టి.చంద్రశేఖర్‌రెడ్డిలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

వేగంగా జాతీయ రహదారుల పనులు

జిల్లాలో రూ.6210 కోట్లతో 276 కి.మీ. మేర చేపట్టిన 8 జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. జిల్లాలో 16 కోట్లతో 1444 కి.మీ. గుంతలు లేని రహదారులుగా రమ్మతులు చేపట్టి పూర్తి చేశాం. అంతేకాక రాయచోటిలో చేపట్టిన క్రికెట్ స్టేడియం, శిల్పారామం, నగరవనం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



పోలీసు జాగిలంతో చిన్నారి



ప్రదర్శనగా వ్యవసాయశాఖ శకటం



స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన పలువురు ప్రముఖులు



జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెక్కును అందిస్తున్న మంత్రి మండిపల్లి



కలికిరి సైనిక్ స్కూల్ విద్యార్థులతో మంత్రి మండిపల్లి

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్, జేసీ



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు సత్కారం

రాయచోటి నేతాజిసర్కిల్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం రాయచోటిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరించారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తదితరులు రైల్వేకోడూరుకు చెందిన స్వాతంత్ర సమయోధులు రామలింగరాజు కుమారుడు రాధాకృష్ణరాజును, సుండుపల్లె మండలానికి చెందిన యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి కుమారుడు యర్రపురెడ్డి శివకుమార్‌రెడ్డిని సన్మానించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వందే మాతరం అనే గీతానికి కేజీబీవీ, సంబేపల్లె స్కూల్‌కు చెందిన 45 మంది విద్యార్థినులు నృత్య ప్రదర్శన చేశారు. నమో నమో భారతం అనే గీతానికి బీసీ వెల్ఫేర్ హాస్టల్ రాజంపేటకు చెందిన 28 మంది విద్యార్థినులు నృత్య ప్రదర్శన చేశారు. దేశభక్తి థీమ్‌తో సాగిన కలికిరి సైనిక్ స్కూల్ 37 మంది విద్యార్థినీ, విద్యార్థుల ప్రదర్శన అందరినీ అలరించింది. రామసముద్రం మండలం మట్లవారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు కోలాటం ఆకట్టుకుంది. రాయచోటి ఏపీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థుల దేశభక్తి గీతం గ్రూప్ డాన్స్ ప్రదర్శన అందరినీ అకట్టుకున్నాయి.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రెండు కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం

- అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



కలికిరి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వెనుకబడిన కులాలకు సంబంధించిన సంక్షేమ కార్పొరేషన్లకు ఛైర్మన్‌లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర జంగమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కలికిరి మండలానికి చెందిన వాసునూరి చంద్రశేఖర్‌ను, రాష్ట్ర పాల-ఏకిరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కందూరు నాగేశ్వరనాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. బాధ్యతల నాటి నుంచి రెండేళ్ల పదవీ కాలంతో వీరిని నియమించారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఈ మేరకు విడివిడిగా రెండు ఆదేశాలు జారీ చేశారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి : ఎస్పీ



జెండా వందనం చేస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డులో గల ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జాతీయ జెండాను ఎగురవేసి రిజర్వ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ రక్షణలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలను కొనియాడారు. మన దేశం సాధించిన ప్రగతిలో పోలీసుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని, శాంతియుత వాతావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి జాతీయ జెండాను ఎగురవేశారు.

హార్సిలీహిల్స్‌కు చేరుకున్న మంత్రి సత్యకుమార్

- స్వాగతం పలికిన అధికారులు

బి.కొత్తకోట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్ బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు విచ్చేశారు. శుక్రవారం చిత్తూరు జిల్లా పర్యటనను ముగించుకొని రాత్రికి హిల్స్ పైకి చేరుకున్నారు. ప్రొటోకాల్ మేరకు రెవెన్యూ, వైద్యశాఖ అధికారులు మంత్రికి పుష్పగుచ్ఛాలతో సాదరస్వాగతం పలికారు. గవర్నర్ బంగ్లాలో మంత్రికి విడిది ఏర్పాట్లు చేశారు. కొండపై అధికారిక కార్యక్రమాలు ఏవీ లేనప్పటికీ శనివారం మధ్యాహ్నం వరకు వ్యక్తిగత పర్యటనలో భాగంగా హార్సిలీహిల్స్‌లో గడపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మంత్రికి స్వాగతం పలికిన వారిలో అన్నమయ్య జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో, మెడికల్ ఆఫీసర్ యస్థాని, తహసీల్దార్ బావాజాన్, ఆర్ఐ వీరాంజనేయులు తదితరులు వున్నారు.

నీటిగుండంలో యువకుడు గల్లంతు



గల్లంతైన యువకుడిని వెతికేందుకు వెళుతున్న పోలీస్, ఫైర్ సిబ్బంది

అట్లూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): లంకమల అభయారణ్యంలోని లంక మల్లేశ్వరుని ఆలయం పక్కనే ఉన్న గుండంలో శుక్రవారం ఈత కొడుతూ మైదుకూరుకు చెందిన హబీబుల్లా (36) అనే యువకుడు గల్లంతయ్యాడని అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మైదుకూరు చెందిన నలుగురు యువకులు లంకమలలోని గుండంలో ఈత కొడుతుండగా వారిలో హబీబుల్లా గల్లంతయ్యాడు. దీంతో మిగిలిన ముగ్గురు అతని ఆచూకీ కోసం నీటిగుండంలో గాలించినా అతని ఆచూకీ లభించలేదు. అక్కడ సెల్‌ఫోన్లు పనిచేయకపోవడంతో నందిపల్లె సమీపంలోకి వచ్చి టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోను చేసి చెప్పారు. వారిచ్చిన సమాచారంతో ఫైర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది గుండం వద్దకు చేరుకుని యువకుడి కోసం గాలిపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి వరకు కూడా యువకుడి ఆచూకీ దొరకలేదు. కాగా.. గల్లంతైన హబీబుల్లా ఆటో మెకానిక్‌గా పనిచేసేవాడు.

మహిళలకు స్త్రీశక్తి వరం లాంటిది

- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దు: కలెక్టర్



ఉచిత బస్సు కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్ తదితరులు

రాయచోటి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీశక్తి) హామీ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి బస్టాండు ప్రాంగణంలో మంత్రి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లతో కలిసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించారన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆధార్, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీల్లో ఏదో ఒకటి చూపించి కండక్టర్ జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించవచ్చని తెలిపారు. ఆర్టీసీలోని మొత్తం 8,458 బస్సుల్లో మహిళలు, యువతులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. అనంతరం బస్సుల పూజా కార్యక్రమంలో మంత్రి పాల్గొని జెండా ఊపి ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ఉచిత ప్రయాణ స్త్రీశక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు కోసం ఏడాదికి రూ.1,942 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించనుందన్నారు. ప్రయాణికులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. మహిళా ప్రయాణికుల పట్ల సంస్థ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఏ విధమైన ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చంద్రశేఖర్, డీపీటీవో రాము, డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల నిరీక్షణ !

- గోకులాల నిర్మాణాలు పూర్తయి ఏడు నెలలు
- రెండు నెలల కిందట పాక్షిక చెల్లింపులు
- మిగిలిన బిల్లులు త్వరగా చెల్లించాలని రైతుల విజ్ఞప్తి

పీలేరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా గోకులాలు, మినీ గోకులాల నిర్మాణాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పాడి రైతులకు ప్రోత్సాహకంగా చేపట్టిన గోకులాల నిర్మాణం ప్రభుత్వ ఆలోచనలు, అధికారుల చిత్తశుద్ధి కారణంగా అనతి కాలంలోనే వేగంగా నిర్మితమయ్యాయి. అధిక శాతం నిర్మాణాలు గత ఏడాది అక్టోబరు, నవంబరు మాసాల్లో ప్రారంభమై డిసెంబరు నాటికి పూర్తి కాగా జనవరిలో పండుగ వాతావరణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వాటికి ప్రారంభోత్సవాలు జరిపారు. అయితే నిర్మాణాల సమయంలో చూపిన చురుకుతనం అధికారులు బిల్లుల చెల్లింపులో చూపకపోవడంతో వాటిని నిర్మించుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. గోకులాలు నిర్మించుకుని ఏడెనిమిది నెలలు కావస్తున్నా కేవలం తొలివిడత బిల్లులు మాత్రమే చెల్లించారని, మిగిలిన బిల్లుల గురించి అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

90 శాతం రాయితీతో రైతుల ఆసక్తి

పాడి రైతులను ఆదుకునేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం 2018లో గోకులం పథకం కింద మినీ గోకులం షెడ్డు నిర్మాణాలు చేపట్టింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించింది. షెడ్ల నిర్మాణాలకు నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ ముందుకు రాలేదు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం గోకులం పథకం పునరుద్ధరించి నిర్మాణాలు చేపట్టింది. పశుపోషకులకు 90 శాతం సబ్సిడీ, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం సబ్సిడీతో షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నది. పీలేరు నియోజకవర్గంలోని అధిక శాతం మంది రైతులు రూ.2.30 లక్షలు విలువజేసే 6 ఆవుల షెడ్లను నిర్మించుకున్నారు.

- 2 ఆవుల షెడ్డు యూనిట్ విలువ రూ.1.15 లక్షలు కాగా అందులో ఉపాధి నిధులు రూ.1.03 లక్షలు, రైతు వాటా రూ.11,500లు
- 4 ఆవుల షెడ్డు యూనిట్ విలువ రూ.1.85 లక్షలు. ఉపాధి హామీ నిధులు రూ.1.66 లక్షలు, రైతు వాటా రూ.18,500లు
- 6 ఆవుల షెడ్డుకు యూనిట్ విలువ రూ.2.30 లక్షలు. ఉపాధి నిధులు రూ.2.07 లక్షలు, రైతు వాటా రూ.23 వేలు



పీలేరు మండలంలో నిర్మితమైన గోకులం షెడ్డు

- 20 జీవాల యూనిట్ విలువ రూ.1.30 లక్షలు. ఉపాధి నిధులు రూ.91 వేలు, రైతు వాటా రూ.39 వేలు
- 50 జీవాల యూనిట్ విలువ రూ.2.30 లక్షలు, ఉపాధి నిధులు రూ.1.61 లక్షలు, రైతు వాటా రూ.69 వేలు
- 100 కోళ్ల షెడ్ యూనిట్ విలువ రూ.87 వేలు. ఉపాధి నిధులు రూ.61 వేలు, రైతు వాటా రూ.26 వేలు
- 200 కోళ్ల షెడ్ యూనిట్ విలువ రూ.1.31 లక్షలు. ఉపాధి నిధులు రూ.92 వేలు, రైతు వాటా రూ.39 వేలు

పీలేరులో 264 గోకులాలు.. సగం బిల్లుల చెల్లింపు

పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ప్రభుత్వం 264 గోకులాలు మంజూరు చేసింది. పీలేరు మండలంలో 51 గోకులాలు మంజూరు కాగా అన్నీ పూర్తయిపోయాయి. వాటిలో 27 మందికి రెండు నెలల క్రితం పాక్షిక బిల్లులు మంజూరయ్యాయి. మిగిలిన 24 మందికి ఎటువంటి బిల్లులు మంజూరు కాలేదు. గడిచిన రెండున్నర నెలలుగా ఉపాధి హామీ పథకం చెల్లింపులు పూర్తిగా స్తంభించిపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. మిగిలిన బిల్లుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

నిధులు, అనుమతులు రాగానే బిల్లులు చెల్లిస్తాం..

గోకులం షెడ్ల పెండింగ్ బిల్లుల గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. మా వైపు నుంచి బిల్లులను సిద్ధంగా పెట్టుకున్నాం. ఉన్నతాధికారుల నుంచి నిధులు, అనుమతులు వచ్చిన వెంటనే వాటిని అప్‌లోడ్ చేస్తాం. తద్వారా రైతులకు బిల్లులు పడతాయి. కాస్త ఆలస్యమైనా బిల్లులు మాత్రం కచ్చితంగా వస్తాయి, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు.

- అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం, పీలేరు మండలం

బిల్లులు చెల్లిస్తే బాగుంటుంది..

గోకులం పథకం ద్వారా నిర్మించుకున్న షెడ్డులో మా ఆవులు సురక్షితంగా ఉన్నాయి. ఈ పథకం పాడి రైతులకు ఎంతో మేలు చేస్తోంది. అయితే బిల్లులు కూడా సకాలంలో అందిస్తే బాగుంటుంది.

- శ్రీరాములు, బోడుమల్లువారిపల్లె

కడప జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందుకున్న జిల్లా అధికారులు



మంత్రి ఫరూఖ్, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు



ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ | ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ | జాన్‌ఎర్విన్, కడప ఆర్డీవో | సాయిశ్రీ, జమ్మలమడుగు ఆర్డీవో | చంద్రమోహన్, బద్వేలు ఆర్డీవో | వెంకటపతి, ఎస్‌డీ కలెక్టరు | మల్లికార్జున, దేవాదాయశాఖ అధికారి | మనోజ్‌రెడ్డి, కమిషనరు, కడప | రాజ్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ | కిరణ్‌కుమార్, మెప్మా పీడీ | రంగస్వామి, రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ | ఓబులమ్మ, జడ్పీ సీఈవో



డాక్టర్ నాగరాజు, డీఎంహెచ్‌వో | పెంచలయ్య, రిమ్స్ సూపరింటెండెంట్ | షంషుద్దీన్, విద్యాశాఖాధికారి | ధర్మారావు, అగ్నిమాపకశాఖ | విజయకుమార్, ఆగ్రోస్ మేనేజరు | సురేశ్‌కుమార్, ఎంప్లాయిమెంటు | ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ | సరస్వతి, సోషల్ వెల్ఫేర్ డీడీ | ఎం.రమణయ్య ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ | వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ | మురళీనాయక్, పులివెందుల డీఎస్పీ | భావన, ప్రొద్దుటూరు డీఎస్పీ | రాజేంద్రప్రసాద్, మైదుకూరు డీఎస్పీ | వెంకటేశ్వర్‌రావు, జమ్మలమడుగు డీఎస్పీ | బాలస్వామిరెడ్డి, మహిళా పీఎస్ డీఎస్పీ



సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ | అబ్దుల్‌కరీం, డీటీసీ డీఎస్పీ | నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ ఏసీ | వినయకుమార్‌రెడ్డి, డీటీసీ సీఐ | శివశంకరనాయక్, సీకేదిన్నె సీఐ | ఓబులేసు, చిన్నచౌకు సీఐ | బాబు, ఒంటిమిట్ట సీఐ | శివశంకర్, మైదుకూరు రూరల్ సీఐ | నరసింహారెడ్డి, ట్రాన్స్‌కో సీఐ | భాస్కర్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ | వై.ప్రసాద్ ఎంవీఐ, కడప



ఉద్యానశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్, జేసీ

అన్నమయ్య జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందుకున్న జిల్లా అధికారులు



మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు



సుబ్రహ్మణ్యం డీఈవో | నాగభూషణం టూరిజంశాఖ ఏడీ | ఖాదర్‌బాషా స్పోర్ట్స్ అండ్ అథారిటీ ఏడీ | సుభాషిణి ఉద్యానశాఖ ఈడీ | వెంకట్ ఇన్‌చార్జి సీపీవో | లక్ష్మీప్రసన్న ఏపీఎంఐపీ ఏడీ | త్యాగరాజు మార్కెటింగ్‌శాఖ ఏడీ | లక్ష్మీపతి జీఎస్‌డబ్ల్యువో | సత్యనారాయణ డీఆర్‌డీఏ పీడీ | కృష్ణకిశోర్ వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ | ప్రసన్నకుమార్ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ | కృష్ణమోహన్ రాయచోటి డీఎస్పీ | వెంకటచలపతి రాయచోటి అర్బన్ సీఐ





ప్రశంసాపత్రాలు అందుకుంటున్న వివిధ పోలీసుశాఖ అధికారులు

సైనిక్ స్కూల్లో ఆకట్టుకున్న ప్రదర్శనలు



గౌరవ వందనం చేస్తున్న సైనిక్ స్కూల్ బాలికా క్యాడెట్‌లు

కలికిరి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైనిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల కవాతులు, గుర్రాలపై విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అఫిషియేటింగ్ ప్రిన్సిపాల్ వింగ్ కమాం డర్ సంజీవ శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సందేశమిచ్చారు. విద్యా, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన క్యాడెట్‌లను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఉత్తమ కవాతు బహుమతిని గోదావరి హౌస్ కైవశం చేసుకుంది. గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో కాక్ హౌస్ ట్రోఫీని పెన్నా, తుంగభద్ర హౌస్‌లు సంయుక్తంగా గెలుచుకున్నాయి. రాయచోటిలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యుత్త ప్రదర్శనకు సైనిక్ స్కూల్ విద్యార్థులకు మంత్రి మెమెంటోలు అందజేశారు. జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను సత్కరించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ టెన్త్ మెరిట్ విద్యార్థులకు తిమ్మారెడ్డి మెమోరియల్ అవార్డులను విద్యార్థులు రంజిత్, చరణ్‌తేజ, సాయికిరణ్‌కు వరుసగా రూ.25, 15, 10 వేల వంతున అందజేశారు. మేడికుర్తి జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు విశ్రాంత వార్డెన్ రత్నశేఖర్‌రెడ్డి రూ.5 వేలు, 3వేలు, 1500 వేయి వంతున అందజేశారు.

జన్ సురక్ష పథకాలపై అవగాహన కల్పించాలి : జేసీ

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో జన్ సురక్ష పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జన్ సురక్ష పథకాలకు సంబం ధించి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరు 30 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్ సురక్ష పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్సన్ యోజన పథకాలను ప్రజల్లోకి విస్తృతస్థాయిలో తీసుకెళ్లి నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఇందుకు తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని ఎల్డీఎం, అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలను గుర్తించి ఖాతాలు తెరిపించాలన్నారు. జన్‌ధన్ బ్యాంకు ఖాతాల ఈకేవైసీ చేయని వారిని గుర్తించి అప్డేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆర్థిక అక్షరాశ్యతపై, ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్డీఏ, అర్బన్ పరిధిలో మెప్మాశాఖల ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలను భాగస్వాములు చేయడం ద్వారా కార్యక్రమం ముందుకు తీసుకెళ్లేందుకు వీలుంటుందన్నారు. అవగాహన సదస్సుల్లో అటల్ పెన్షన్ యోజన ఖాతాలు తెరవడంపై దృష్టి సారించాలన్నారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల్లో బ్యాంకులు ప్రతి బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్ధన్, నాబార్డు ఏజీఎం విజయవిహారీ, డీఆర్డీఏపీడీ రాజ్యలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

జడ్‌హెచ్‌డీసీ భూముల ఆక్రమణలపై చర్యలు

● పరిశీలించిన తహసీల్దార్ యామిని

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఓబులవారిపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్న ఓరంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జడ్‌హెచ్‌డీసీ భూముల ఆక్రమణపై ఆంధ్రజ్యోతిలో ఆగస్టు 14న వెలువడిన వార్తకు స్పందించిన తహసీల్దారు యామిని పరిశీలించారు. ఆక్రమిత పొలాల వద్దకు సర్వేయర్, వీఆర్వో తో పాటు వెళ్లి ఆమె పరిశీలించారు. అలాగే భూ ఆక్రమణదారులను పిలిపించి విచారించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, అన్ని ఆధారాలతో సోమవారం కార్యాలయంలో కలవాలని సూచించారు. సక్రమమైన ఆధారాలు లేకపోతే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సీకేదిన్నె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిమడుగు వద్ద ద్విచక్ర వాహనాన్ని చెత్తవాహనం ఢీకొనడంతో షేక్ షామీర్ అనే వ్యక్తి మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. గువ్వలచెరువకు చెందిన షామీర్ కడపకు మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంలో వస్తుండగా మద్దిమడుగు డంపింగ్‌యార్డు వద్ద చెత్త వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి గాయపడటంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అర్ధరాత్రి వరకు బార్లకు అనుమతి ఇవ్వడం దారుణం



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏపీని తాగుబోతుల రాష్ట్రంగా మార్చాలని చూస్తోందని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మీ తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఏపీ ప్రభు త్వం అర్ధరాత్రి వరకు బార్లకు, బ్రాందీ షాపులకు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వడానికి నిరసనగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల మాన ప్రాణాలకు, కుటుంబాల విచ్ఛిన్నానికి దారి తీసే విధానాలు అవలంభిస్తూ మంచి ప్రభుత్వం అని ఎలా కితాబు ఇచ్చుకుంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాలను పునరాలోచించి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ కన్వీనర్ హరితా, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, రెహనా, ఎస్పీ మహమూద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అదిగో పులి.. ఇదిగో తోక...!

భయంభయంగా అలిరెడ్డిపల్లె రైతులు



అలిరెడ్డిపల్లె చుట్టుపక్కల పొలాల్లో పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

వేంపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అదిగో చిరుత, ఇదిగో చిరుతలు ఉన్నాయంటూ అలిరెడ్డిపల్లె, వేంపల్లె రైతులు భయాందోళన చెందుతున్నారు. వేంపల్లె మండల పరిధిలోని పాపాఘ్ని నది అవతలున్న అలిరెడ్డిపల్లె సమీపంలోని ఎద్దలకొండ వెనుకవైపున అలిరెడ్డిపల్లె, వేంపల్లెకు చెందిన రైతులకు పొలాలు ఉన్నాయి. వెనుకాలే శేషాచల అడవులు ఉన్నాయి. కొద్దిరోజులుగా దూరంగా చిరుతలు కనిపిస్తున్నాయన్న అనుమానం రైతులకు ఉంది. గురువారం రాత్రి దూరంగా రెండు చిరుతలు కనిపించాయంటూ పలువురు భయానికి గురయ్యారు. ఈ విషయాన్ని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, డీఆర్‌ఓ వెంకట సుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే డీఆర్‌ఓ వెంక టసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శేషాచల అడవులలోని చుట్టుప క్కల గాలించారు. అక్కడున్న కాలిగుర్తులు బట్టి అవి చిరుతలు కావని, ఇతర జంతువులు ఉంటాయని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో చిరుతలు లేవని.. ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని రేంజర్ తెలిపారు. కొత్త జంతువులు ఏవైనా కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

మహిళలతో కిటకిటలాడిన ఆర్టీసీ బస్సులు



జిల్లాలో ప్రారంభమైన స్త్రీశక్తి పథకం

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి. ఏ బస్సు చూసిన మహిళలతో నిండుకున్నాయి. బస్సుల్లో తొలిసారిగా ఉచితంగా ప్రయాణం చేస్తుండడంతో మహిళల్లో సంతోషం చెప్పనలివి కాదని చెప్పవచ్చు. స్త్రీశక్తి పథకం కింద శుక్రవారం (15వ తేదీ) మహిళలకు ఉచిత బస్సులను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లాకు సంబంధించి కడప నగరంలో మంత్రి ఫరూక్, కడప ఎమ్మెల్యే మాధవి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, టీడీపీజిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కమలాపురంలో ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఆర్డీఓ జాన్ ఇర్విన్ ప్రారంభించారు. బద్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రితీష్‌కుమార్, ఆర్డీఓ, ఆర్టీసీ డీఎం ప్రారంభించారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జమ్మలమడుగులో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, మైదుకూరులో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, పులివెందులలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రారంభించారు.

జిల్లాలో 462 పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులో బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జండర్లు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. తాము ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారమన్న గుర్తింపు కార్డులైన ఆధార్, ఓటర్, ప్రభుత్వం జారీచేసిన కార్డులు చూపిస్తే చాలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. అయితే నాన్‌స్టాప్, అంతర్‌రాష్ట్ర, కాంట్రాక్ట్ క్యారేజ్, ప్యాకేజీ టూర్ బస్సుల్లో మాత్రం ఉచిత ప్రయాణాలు వర్తించవన్నారు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్‌లగ్జరీ, స్టార్‌లైన్, ఇంద్ర, ఏసీ బస్సుల్లో ఉచితం లేదు.

వీరభద్రుడి సన్నిధిలో మంత్రి మండిపల్లి దంపతులు

రాయచోటిటౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని శుక్రవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సతీమణి హరిత, కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి సందర్శించారు. పూజల అనంతరం వినాయక బోర్ వెల్స్ వారు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు.

పెన్నానది వద్ద పోలీసుల గస్తీ

సిద్దవటం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సమీపంలో పెన్నానది కాజ్‌వేపై చేపలు పడుతున్న పలువురికి మండల ఎస్ఐ మహమ్మద్‌రఫీ కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రవాహంలో నుంచి ఎగిరి లోకాజ్‌వేపై పడుతున్న చేపలను పట్టుకునే క్రమంలో తోపులాట జరిగే ప్రమాదం ఉందన్న భావనతో ఆ ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు శివప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడవాలి


రాయచోటి కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు


దేవదాయ, పర్యాటకశాఖ అధికారులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కడపజిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

రాయచోటి నేతాజిసర్కిల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మనదేశ స్వాతంత్రం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన ఎందరో మహానుభావులను విద్యార్థులు గుర్తు చేసుకోవాలని, వారి అడుగుజాడల్లో నడవాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ తెలియజేశారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి అధికారులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. విద్యార్థులకు చాక్లెట్లు పంచిపెట్టారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మన దేశ స్వాతంత్రం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన ఎందరో మహానుభావుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. అటువంటి మహనీయులను గుర్తు చేసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని విద్యార్థినీ, విద్యార్థులకు సూచించారు.

రాజంపేట: రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సబ్‌కలెక్టర్ భావన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యో గులకు పురస్కారాలను అందజేశారు. డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, మున్సిపల్ కార్యాలయంలో కమి షనర్ శ్రీనివాసులు, జవహర్ నవోదయ విద్యాలయంలో జిల్లా మూడో అదనపు న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ గంగాధరన్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అన్నమాచార్య యూనివర్శిటీలో చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి వక్తృత్వ, వ్యాస రచన, క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, అధ్యాపకులకు బహుమతులను అందజేశారు. అన్నమాచార్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాళ్లు ఎస్ఎంవి నారాయణ, డాక్టర్ డి.స్వర్ణలత, డాక్టర్ డీజే సమతానాయుడు, డాక్టర్ బి.జయరామిరెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, డీన్ వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయం వద్ద కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, యువ నాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి, కూటమి నాయకులతో కలసి జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ జనసేన పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ కన్వీనర్లు పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేష్, జోగినేని మణితదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండలంలోని వత్తలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.

ఓబులవారిపల్లె : తహసీల్దారు, ఈవోఆర్డీ కార్యాలయాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవశ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి జెండా ఆవిష్కరించారు. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఎంపీపీ చీరల నాగమ్మ, వైస్ ఎంపీపీ గౌరీశంకర్‌రాజు, మండల టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, నాగినేని రమేష్ నాయుడు, ముస్లిం మైనార్టీ నాయకులు వల్లి, వేణుగోపాల్‌రెడ్డి, పోలిన శివయ్యనాయుడు తదితరులుపాల్గొన్నారు.

దేవదాయశాఖ శకటానికి తొలి బహుమతి

ఒంటిమిట్ట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పర్యాటకశాఖ, దేవదాయధర్మదాయశాఖ సంయుక్తంగా ప్రదర్శించిన శకటానికి తొలి బహుమతి లభించింది. శకటంలో ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ ద్వారాలు గండికోటలోని ప్రధాన సన్నివేశాలు సిద్దవటం కోట పుష్పగిరి, దేవుని కడప ఆలయాల నమూనాలను ప్రదర్శించారు. గండికోటలోని మాధవరాయస్వామి ఆలయం, జుమ్మామసీద్, రంగనాయక స్వామి ఆలయం తదితరాలను ప్రదర్శించారు. పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాల మధ్య అనుసంధానం, పర్యావరణ పరిరక్షణ అంశాలను అద్భుతంగా ప్రదర్శించడంతో ప్రథమ బహుమతి లభించింది.


మాసాపేట మార్కెట్ యార్డులో జాతీయ జెండా ఎగురవేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి


రాయచోటి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న బిట్స్ చైర్మన్ ఎం. భాస్కర్

సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు వరాలు


రైల్వేకోడూరు: ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా


రాజంపేట: ఉచిత బస్సును ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ భావన, టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రైల్వేకోడూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు వరాలుగా మారాయని జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం స్త్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి తన సత్తాచాటుకుంటున్నారన్నారు. ఏ ప్రభుత్వం అమలు చేయలేని పథకాలు ఆంధ్ర రాష్ట్రం లో అమలు అవుతున్నాయని ఇతర రాష్ట్రాలు కొనియాడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీఎల్‌డీవో నరసింహమూర్తి, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, ఎంపీడీవో నాగార్జునరావు, ఉపాధి ఏపీవో మృత్యుంజయరావు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ మల్లికార్జున రాజు, ఏపీవో వసుంధర, శానటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రాజు, ఆర్టీసీ ఇన్‌చార్జి హరి, ఆర్ఐ లక్ష్మీదేవి, కూటమి నాయకులు, మహిళలు పాల్గొ న్నారు.

మహిళా పక్షపాతి చంద్రబాబునాయుడు

రాజంపేట టౌన్: మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించి మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి అని పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలియజేశారు. శుక్రవారం పాతబస్టాండులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రాజంపేట సబ్‌కలెక్టర్ భావన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రయాణం పథకం అమలుపై మహిళలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. ఇలాంటి మంచి ప్రభుత్వానికి ప్రతిఒక్కరు అండగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య, కృష్ణమూర్తి, తహసీల్దారు పీరుమున్నీ, కూటమి నేతలు పాల్గొన్నారు.

సుండుపల్లె: ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు మాలేపాటి సురేశ్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్‌బాబు, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు రాచరాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: టీడీపీ సీనియర్ నాయకులు లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు, అడ్వకేట్ బాలాజీ, కాకర్ల నాగార్జున కొత్తబస్టాండులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పూజలు చేసి జెండా ఊపి బస్సు ప్రారంభించారు.

జెండా ర్యాలీని అడ్డుకున్న కానిస్టేబుల్!

● ప్రశ్నించినందుకు దౌర్జన్యం.. బెదిరింపులు


పాటలు ఆపమని డ్రైవర్‌ను బెదిరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సాధిక్‌అలీ

సుండుపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 500 అడుగుల జాతీయ జెండాతో సుండుపల్లె మండల కేంద్రంలో విద్యార్థులు నిర్వహిస్తున్న ర్యాలీని సాధిక్ అలీ అనే హెడ్‌కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. ఇదేమిటని ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి విలేఖరిపై దౌర్జన్యంగా వ్యవహరించాడు. మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సుమారు 550 మంది 500 అడుగుల జాతీయ త్రివర్ణ పతాకంతో నిర్వహిస్తున్న ర్యాలీని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ ర్యాలీ మండల కేంద్రంలోని ప్రధాన వీధిలోకి చేరుకున్న సమయంలో దేశభక్తి గీతాలు వినిపిస్తూ ర్యాలీ ముందు వెళుతున్న వాహనాన్ని తొలుత హెడ్ కానిస్టేబుల్ అడ్డుకున్నారు. ఎందుకు రా.. పాటలు పెట్టారు. అనుమతులు ఉన్నాయా అని ఆగ్రహంతో ఊగిపోయారు. పాట ఆపించి వాహనాన్ని పంపించారు. అనంతరం ర్యాలీగా వస్తున్న విద్యార్థులను అడ్డుకోవడంతో తాము ఎస్ఐ వద్ద అనుమతులు తీసుకున్నామని ఉపాధ్యాయులు చెప్పినా వినలేదు. ఈ ర్యాలీ ఫొటోలు తీస్తూ అక్కడే ఉన్న విలేఖరి ఈ వ్యవహారంపై ప్రశ్నించగా హెడ్ కానిస్టేబుల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతలోనే అక్కడికి వచ్చిన ఎస్ఐ శ్రీనివాసులు దృష్టికి సమస్య తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా.. స్టేషన్‌కు రా.. నేనేందో చూపిస్తానంటూ భుజం పట్టుకొని లాక్కెళ్లేందుకు యత్నించాడు చేశాడు. దీంతో ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్‌ను తన వాహనంలో తీసుకెళ్లి పోయాడు.

డంపింగ్‌యార్డు పరిశీలన


కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లె రోడ్డులో డంపింగ్ యార్డును శుక్రవారం రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి సందర్శించి, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న వర్మీ కంపోస్టు, లెగసీ వేస్ట్ ప్రాసెస్ పనులను పరిశీలించారు. వర్మీ కంపోస్టును డంప్‌యార్డులోని మొక్కలకు వినియోగించి గ్రీనరీని పెంచాలని సూచించారు. లెగసీ వేస్ట్ ప్రాసెస్ చేసే యంత్రాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి రోజు ఎంత లెగసీని ప్రాసెస్ చేస్తున్నారనే విషయంపై ఆరా తీయడంతో పాటు రికార్డులను పకడ్బందీగా నిర్వహించి, ప్రతి వారం మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించాలని సూచించారు.

రాజంపేట అగ్నిమాపక అధికారిగా రాధాకృష్ణ



రాజంపేట టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట అగ్నిమాపక అధికారిగా రాధాకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పుట్టపర్తి అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై రాజంపేటలో నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న అగ్నిమాపక అధికారి మాబు సుభాన్ కదిరికి బదిలీ అయ్యారు.

ప్రతి కార్మికుడు జీవిత బీమా పొందాలి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు జీవిత బీమా పొందాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ సూచించారు. శుక్రవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, హమాలీలు, బేల్దారులు, హోటల్, ఆటో, బస్సు డ్రైవర్లు, ఉపాధి కూలీలు తదితరులు పనులు చేసే సమయంలో ప్రమాదాలు జరిగితే. బీమా వారి కుటుంబాల కు అండగా నిలుస్తుందన్నారు. తక్షణమే కార్మికులు అందరూ ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి తపాలా ఆఫీసు ద్వారా సంవత్సరానికి రూ. 100, రూ. 150 లు చెల్లించాలని తెలిపారు.

రైల్వేకోడూరు ప్రధానదారికి మరమ్మతులు


దెబ్బతిన్న రోడ్డును తొలగిస్తున్న యంత్రం

రైల్వేకోడూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానదారి అక్కడక్కడ దెబ్బ తినడంతో జాతీయ రహదారుల అధికారులు శుక్ర వారం మరమ్మతులు ప్రారంభించారు. పద్మావతి సూపర్ మార్కెట్ నుంచి సిద్ధేశ్వర సినిమా థియేటర్ వరకు యంత్రాల సాయంతో దెబ్బతిన్న సిమెంటు రోడ్డును తొలగించి సిమెంట్ వేశారు. సర్పంచ్ బుడిగి శివయ్య, కూటమి నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్ తదితరులు పరిశీలించారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణంరాజు

వీరబల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీ కొత్త వడ్డెపల్లెలోని ప్రాథమిక, అంగన్వాడీ పాఠశాల విద్యార్థులకు అదే పంచాయతీ కోనేటివాండ్లపల్లెకు చెందిన ఆర్. రామకృష్ణంరాజు దుప్పట్లను అందజేయగా, శుక్రవారం హెచ్ఎం వెంకట్రమణ విద్యార్థులకు పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్ దుర్గా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు

సుండుపల్లె, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. గోత్రమాల లో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించామన్నారు. ఈ సందర్భంగా మహిళలు పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులు తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి


ప్రసంగిస్తున్న ఏకలవ్య ఫౌండేషన్ నిర్వాహకులు సాయిలక్ష్మి

రాజంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏకలవ్య ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆ ట్రస్టు జిల్లా కార్యనిర్వాహకురాలు సాయిలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 29 పాఠశాలల్లో ప్రధానంగా రాజంపేటలోని 25 పాఠశాలల్లో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశామన్నారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకశక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, స్కూల్ కమిటీ ఛైర్మన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న సంజీవరెడ్డి

సిద్దవటం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సమీపంలోని పరమాత్మ సేవా ఆశ్రమంలో శుక్రవారం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మల్లు సంజీవరెడ్డి, తండ్రి మల్లు గంగిరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లు మధుసూదన్‌రెడ్డి, మల్లు రమణారెడ్డి, విశ్వనాథరెడ్డి, చిన్నపిచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందుకున్న జిల్లా అధికారులు



మంత్రి ఫరూఖ్, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ | ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ | జాన్‌ఎర్విన్, కడప ఆర్డీవో | సాయిశ్రీ, జమ్మలమడుగు ఆర్డీవో | చంద్రమోహన్, బద్వేలు ఆర్డీవో | వెంకటపతి, ఎస్‌డీ కలెక్టరు | మల్లికార్జున, దేవదాయశాఖ అధికారి | మనోజ్‌రెడ్డి, కమిషనరు, కడప | రాజ్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ | కిరణ్‌కుమార్, మెప్మా పీడీ | రంగస్వామి, రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ | ఓబులమ్మ, జడ్పీ సీఈవో



డాక్టర్ నాగరాజు, డీఎంహెచ్‌వో | పెంచలయ్య, రిమ్స్ సూపరింటెండెంట్ | షంషుద్దీన్, విద్యాశాఖాధికారి | ధర్మారావు, అగ్నిమాపకశాఖ | విజయకుమార్, ఆగ్రోస్ మేనేజరు | సురేశ్‌కుమార్, ఎంప్లాయిమెంటు | ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ | సరస్వతి, సోషల్ వెల్ఫేర్ డీడీ | ఎం.రమణయ్య ఏపీఈఆడబ్ల్యుఐడీసీ ఈఈ | వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ | మురళీనాయక్, పులివెందుల డీఎస్పీ | భావన, ప్రొద్దుటూరు డీఎస్పీ | రాజేంద్రప్రసాద్, మైదుకూరు డీఎస్పీ | వెంకటేశ్వర్‌రావు, జమ్మలమడుగు డీఎస్పీ | బాలస్వామిరెడ్డి, మహిళా పీఎస్ డీఎస్పీ



సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ | అబ్దుల్‌కరీం, డీటీసీ డీఎస్పీ | నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ ఏసీ | వినయకుమార్‌రెడ్డి, డీటీసీ సీఐ | శివశంకరనాయక్, సీకేదిన్నె సీఐ | ఓబులేసు, చిన్నచౌకు సీఐ | బాబు, ఒంటిమిట్ట సీఐ | శివశంకర్, మైదుకూరు రూరల్ సీఐ | నరసింహారెడ్డి, ట్రాన్స్‌కో సీఐ | భాస్కర్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ | వై.ప్రసాద్ ఎంవీఐ, కడప



ఉద్యానశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్, జేసీ

అన్నమయ్య జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందుకున్న జిల్లా అధికారులు



మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్వో మధుసూదన్‌రావు



సుబ్రహ్మణ్యం డీఈవో | నాగభూషణం టూరిజంశాఖ ఏడీ | ఖాదర్‌బాషా స్పోర్ట్స్ అండ్ అథారిటీ ఏడీ | సుభాషిణి ఉద్యానశాఖ ఈడీ | వెంకట్ ఇన్‌చార్జి సీపీవో | లక్ష్మీప్రసన్న ఏపీయంఐపీ ఏడీ | త్యాగరాజు మార్కెటింగ్‌శాఖ ఏడీ | లక్ష్మీపతి జీఎస్‌డబ్ల్యువో | సత్యనారాయణ డీఆర్‌డీఏ పీడీ | కృష్ణకిశోర్ వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ | ప్రసన్నకుమార్ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ | కృష్ణమోహన్ రాయచోటి డీఎస్పీ | వెంకటచలపతి రాయచోటి అర్బన్ సీఐ





ప్రశంసాపత్రాలు అందుకుంటున్న వివిధ పోలీసుశాఖ అధికారులు

సైనిక్ స్కూల్లో ఆకట్టుకున్న ప్రదర్శనలు



గౌరవ వందనం చేస్తున్న సైనిక్ స్కూల్ బాలికా క్యాడెట్‌లు

కలికిరి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైనిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల కవాతులు, గుర్రాలపై విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అఫిషియేటింగ్ ప్రిన్సిపాల్ వింగ్ కమాండర్ సంజీవ శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సందేశమిచ్చారు. విద్యా, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన క్యాడెట్‌లను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఉత్తమ కవాతు బహుమతిని గోదావరి హౌస్ కైవశం చేసుకుంది. గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో కాక్ హౌస్ ట్రోఫీని పెన్నా, తుంగభద్ర హౌస్‌లు సంయుక్తంగా గెలుచుకున్నాయి. రాయచోటిలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యుత్త ప్రదర్శనకు సైనిక్ స్కూల్ విద్యార్థులకు మంత్రి మెమొంటోలు అందజేశారు. జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను సత్కరించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ టెన్త్ మెరిట్ విద్యార్థులకు తిమ్మారెడ్డి మెమోరియల్ అవార్డులను విద్యార్థులు రంజిత్, చరణ్‌తేజ, సాయికిరణ్‌కు వరుసగా రూ.25, 15, 10 వేల వంతున అందజేశారు. మేడికుర్తి జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు విశ్రాంత వార్డెన్ రత్నశేఖర్‌రెడ్డి రూ.5 వేలు, 3వేలు, 1500 వేయి వంతున అందజేశారు.

జన్ సురక్ష పథకాలపై అవగాహన కల్పించాలి : జేసీ

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో జన్ సురక్ష పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జన్ సురక్ష పథకాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరు 30 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్ సురక్ష పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజల్లోకి విస్తృతస్థాయిలో తీసుకెళ్లి నమోదు పక్రియను విజయవంతం చేయాలన్నారు. ఇందుకు తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని ఎల్డీఎం, అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలను గుర్తించి ఖాతాలు తెరిపించాలన్నారు. జన్‌ధన్ బ్యాంకు ఖాతాల ఈకేవైసీ చేయని వారిని గుర్తించి అప్డేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆర్థిక అక్షరాశ్యతపై, ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్డీఏ, అర్బన్ పరిధిలో మెప్మాశాఖల ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలను భాగస్వాములు చేయడం ద్వారా కార్యక్రమం ముందుకు తీసుకెళ్లేందుకు వీలుంటుందన్నారు. అవగాహన సదస్సుల్లో అటల్ పెన్షన్ యోజన ఖాతాలు తెరవడంపై దృష్టి సారించాలన్నారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల్లో బ్యాంకులు ప్రతి బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్థన్, నాబార్డు ఏజీఎం విజయవిహారీ, డీఆర్డీఏపీడీ రాజ్యలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

అదిగో పులి.. ఇదిగో తోక...!

భయంభయంగా అలిరెడ్డిపల్లె రైతులు



అలిరెడ్డిపల్లె చుట్టుపక్కల పొలాల్లో పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

వేంపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అదిగో చిరుత, ఇదిగో చిరుతలు ఉన్నాయంటూ అలిరెడ్డిపల్లె, వేంపల్లె రైతులు భయాందోళన చెందుతున్నారు. వేంపల్లె మండల పరిధిలోని పాపాఘ్ని నది అవతలున్న అలిరెడ్డిపల్లె సమీపంలోని ఎద్దలకొండ వెనుకవైపున అలిరెడ్డిపల్లె, వేంపల్లెకు చెందిన రైతులకు పొలాలు ఉన్నాయి. వెనుకాలే శేషాచల అడవులు ఉన్నాయి. కొద్దిరోజులుగా దూరంగా చిరుతలు కనిపిస్తున్నాయన్న అనుమానం రైతులకు ఉంది. గురువారం రాత్రి దూరంగా రెండు చిరుతలు కనిపించాయంటూ పలువురు భయానికి గురయ్యారు. ఈ విషయాన్ని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, డీఆర్‌ఓ వెంకట సుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే డీఆర్‌ఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శేషాచల అడవులలోని చుట్టుపక్కల గాలించారు. అక్కడున్న కాలిగుర్తులు బట్టి అవి చిరుతలు కావని, ఇతర జంతువులు ఉంటాయని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో చిరుతలు లేవని.. ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని రేంజర్ తెలిపారు. కొత్త జంతువులు ఏవైనా కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

అర్ధరాత్రి వరకు బార్లకు అనుమతి ఇవ్వడం దారుణం



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏపీని తాగుబోతుల రాష్ట్రంగా మార్చాలని చూస్తోందని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఏపీ ప్రభుత్వం అర్ధరాత్రి వరకు బార్లకు, బ్రాందీ షాపులకు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వడానికి నిరసనగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల మాన ప్రాణాలకు, కుటుంబాల విచ్ఛిన్నానికి దారి తీసే విధానాలు అవలంబిస్తూ మంచి ప్రభుత్వం అని ఎలా కితాబు ఇచ్చుకుంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాలను పునరాలోచించి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ కన్వీనర్ హరితా, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, రెహనా, ఎస్పీ మహమూద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జడ్‌హెచ్‌డీసీ భూముల ఆక్రమణలపై చర్యలు

● పరిశీలించిన తహసీల్దార్ యామిని

ఓబులవారిపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్న ఓరంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జడ్‌హెచ్‌డీసీ భూముల ఆక్రమణపై ఆంధ్రజ్యోతిలో ఆగస్టు 14న వెలువడిన వార్తకు స్పందించిన తహసీల్దారు యామిని పరిశీలించారు. ఆక్రమిత పొలాల వద్దకు సర్వేయర్, వీఆర్వో తో పాటు వెళ్లి ఆమె పరిశీలించారు. అలాగే భూ ఆక్రమణదారులను పిలిపించి విచారించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, అన్ని ఆధారాలతో సోమవారం కార్యాలయంలో కలవాలని సూచించారు. సక్రమమైన ఆధారాలు లేకపోతే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిల్లాకు 4 ఆయుష్ అస్పత్రి భవనాలు మంజూరు

పెద్దమండ్యం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 4 ఆయుష్ (ఆయుర్వేదిక్ అస్పత్రి) ఆరోగ్య మందిర్ కొత్త భవనాలు ప్రభుత్వం మంజూరు చేసిందని పెద్దమండ్యం ఆయుష్ డాక్టర్ మహబూబ్‌బాషా శుక్రవారం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ పెద్దమండ్యం, పుల్లంపేట, ఎర్రకోట, నిమ్మనపల్లి మండలాలకు ఆయుష్ ఆరోగ్య మందిర్ కొత్త భవనాలు మంజూరైనట్లు ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. వాటిలో రెండు ఆయుష్, రెండు హోమియోపతి ఆస్పత్రులు ఉన్నట్లు వెల్లడించారు. కేంద్ర నిధులతో కొత్త భవన నిర్మాణ అభివృద్ధి జరుగునున్నట్లు తెలిపారు.

మహిళలతో కిటకిటలాడిన ఆర్టీసీ బస్సులు



జిల్లాలో ప్రారంభమైన స్త్రీశక్తి పథకం

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి. ఏ బస్సు చూసిన మహిళలతో నిండుకున్నాయి. బస్సుల్లో తొలిసారిగా ఉచితంగా ప్రయాణం చేస్తుండడంతో మహిళల్లో సంతోషం చెప్పనలివి కాదని చెప్పవచ్చు. స్త్రీశక్తి పథకం కింద శుక్రవారం (15వ తేదీ) మహిళలకు ఉచిత బస్సులను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లాకు సంబంధించి కడప నగరంలో మంత్రి ఫరూక్, కడప ఎమ్మెల్యే మాధవి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, టీడీపీజిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కమలాపురంలో ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఆర్డీఓ జాన్ ఇర్విన్ ప్రారంభించారు. బద్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రితీష్‌కుమార్, ఆర్డీఓ, ఆర్టీసీ డీఎం ప్రారంభించారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జమ్మలమడుగులో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, మైదుకూరులో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, పులివెందులలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రారంభించారు.

జిల్లాలో 462 పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులో బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జండర్లు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. తాము ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారమన్న గుర్తింపు కార్డులైన ఆధార్, ఓటర్, ప్రభుత్వం జారీచేసిన కార్డులు చూపిస్తే చాలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. అయితే నాన్‌స్టాప్, అంతర్‌రాష్ట్ర, కాంట్రాక్ట్ క్యారేజ్, ప్యాకేజీ టూర్ బస్సుల్లో మాత్రం ఉచిత ప్రయాణాలు వర్తించవన్నారు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్‌లగ్జరీ, స్టార్‌లైన్, ఇంద్ర, ఏసీ బస్సుల్లో ఉచితం లేదు.

మిన్నంటిన సంబరాలు

వేడుకగా 79వ స్వాతంత్ర్య దినోత్సవాలు ● వాడవాడలా రెపరెపలాడిన మువ్వెన్నెల జెండా

● గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన సబ్‌కలెక్టర్ కళ్యాణి

● మున్సిపల్ కార్యాలయంలో జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే షాజహాన్ బాష

79వ స్వాంతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేటు, విద్యాలయాలు, కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండాలు ఎగురవేశారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్ వద్ద సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి జాతీయ జెండా ఎగురవేసి మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యుత్ బకాయిలు వంద శాతం వసూలు సాధించినందుకు పీలేరు ఏపీ ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్ రెడ్డికి తిరుపతిలో ప్రశంసా పత్రం అందించారు. పెద్దతిప్పసముద్రం ఉపాధిహామీ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించ లేదు. వివరాల్లోకెళితే....

మదనపల్లె/మదనపల్లె టౌన్/అర్బన్ ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని వివిధ కార్యాలయాల్లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించారు. సబ్‌కలెక్టరేట్ వద్ద సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి జాతీయ జెండా ఎగురవేసి మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఉత్తమ సేవలందించిన రెవెన్యూ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాష త్రివర్ణ పతాకం ఆవిష్కరించారు. హంద్రీ-నీవా కార్యాలయంలో ఎస్ఈ విఠల్‌ప్రసాద్, ఈఈ సి.ఆర్.రాజ్‌గోపాల్, శ్రీధర్‌రెడ్డి మువ్వెన్నెల జెండాను ఆవిష్కరించారు. సబ్‌రిజిస్ట్రార్, గృహనిర్మాణశాఖ కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి, డీఈ దీన్‌దయాల్‌రాజు జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఉత్తమ సేవలు అందించిన సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి, హౌసింగ్ డీఈ దీన్‌దయాల్‌రాజు రాయచోటిలో మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి



పీలేరులో జెండా వందనం చేస్తున్న విశ్రాంత సైనికోద్యోగులు

ప్రశంసాపత్రం అందుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయం, జడ్పీహైస్కూల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, టిప్పుసుల్తాన్ మైదానాల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాష జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని తహసీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. డీటీ వెంకటస్వామి, ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, సిబ్బంది, బీసీ హక్కుల పోరాట సమితి నేతలు పాల్గొన్నారు. మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మహేంద్ర, తాలుకా, వన్‌టౌన్, టూటౌన్, పోలీసు స్టేషన్లలో ఆయా సీఐలు కళా వెంకటరమణ, మహమ్మద్ రఫీ రాజారెడ్డి జాతీయ పతాకాలు ఎగురవేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి జెండాను ఎగరవేశారు. జడ్పీ హైస్కూల్ నుంచి 1000 అడుగుల జాతీయ జెండాను పురవీధుల్లో ఊరే గించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, బీజేపీ నేత వరదారెడ్డి నారధరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, వాసవీక్లబ్ రిజనల్ జోన్ ఛైర్మన్లు బి.నరేంద్ర కుమార్, ఎ.జ్యోతి ప్రారంభించారు. కురవంక సచివాలయం, ప్రాథమిక పాఠశాల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించారు. కురవంక సర్పంచ్ చలపతి, ఉపసర్పంచ్ నాగరాజ, వార్డుమెంబరు కృష్ణమూర్తి పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో నేత రెడ్డిసా హెబ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి - జడ్పీహైస్కూల్‌లో జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాష, కమిషనర్ ప్రమీల - బురకాయలకోటలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జయచంద్రారెడ్డి - పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన తహసీల్దార్ తేజశ్వి

పెద్దమండ్యంలో....

పెద్దమండ్యం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ తేజశ్వి, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ పూర్ణచంద్రిక, పీహెచ్‌సీలో డాక్టర్ అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణల్లో వారి చిత్రపటాలు, జాతీయజెండాలతో విద్యార్థుల ఊరేగింపులు ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో....

నిమ్మనపల్లి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో మువ్వన్నెల జండాను ఎగురవేశారు. కళాశాల, జడ్పీహైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాను ఎగువేశారు. ఎంపీడీఓ రమేష్ ఆధ్వర్యంలో జాతీజండాను ఎగువేశారు. ఎంఈఓ-1 పద్మావతి, ఎంఈఓ-2 నారాయణ, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

కురబలకోటలో...

కురబలకోట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వాతంత్ర్యదినోత్సవాలను చేసుకున్నారు. పోరాట యోధుల చిత్రపటాలకు నివాళులర్పించి, వారి సేవలను కొనియాడారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భూదేవి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ధనంజయులు, ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ ద్వారకనాథ్, పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, పాఠశాలల్లో హెచ్‌ఎంలు జాతీయ జెండాను ఎగురవేశారు. డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో కరెస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి, గోల్డెన్ వ్యాలీలో కరెస్పాండెంట్ ఎన్‌వీ రమణారెడ్డి, విశ్వం ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో ఛైర్మెన్ విశ్వం ప్రభాకర్‌రెడ్డి, తదితరులు జెండాను ఎగుర వేశారు. ఎంపీడీఓ గంగయ్య, జడ్పీటీసీ బి.జ్యోతి, సర్పంచ్ విశ్వనాథరెడ్డి, మండల కన్వీనర్ వై.జి.సురేంద్ర పాల్గొన్నారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాలు జరిగాయి. ములకలచెరువు మార్కెట్ కమిటీ కార్యాలయం, బురకాయలకోట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐ వెంకటేశులు, తహసీల్దార్ ప్రదీప్, ట్రాన్స్‌కో ఏఈ శేషు, ఏపీఎం మధుబాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ, మస్తాన్‌రెడ్డి, పాస్టర్ శ్రీనివాసులు, ఫజులు, మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుభాషిణి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో...

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాలను నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో శ్రీరాములు నాయక్, మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీధర్ మువ్వన్నెల జెండా ఎగురవేశారు. బస్టాండు కూడలిలో బీఎంఎస్ ఆటో వర్కర్స్ యూనియన్ మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, యూనియన్ అధ్యక్షుడు నరసింహులు, అంజి, టి. సూరి, శివనంది, టి. అంజి, సోమశేఖర్, శంకర పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

బి.కొత్తకోట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నగరపంచాయతీ సహా మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు చేసుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. నగరపంచాయతీ కార్యాలయంలో కమిషనర్ జీవీపల్లవి, తహసీల్దార్ కార్యాలయంలో బావాజాన్, మండలపరిషత్‌లో ఎంపీడీఓ కృష్ణవేణి, పోలీస్‌స్టేషన్‌లో సీఐ గోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ భాగ్యమ్మ, స్త్రీశక్తి భవన్‌లో ఏపీఎం రాజేశ్వరి, ఆదిత్య డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ ప్రసాద్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, విద్యా సంస్థల్లో వేడుకలు చేసుకున్నారు. సివిల్ కోర్టులో ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ థామస్‌రాజ, ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారి తేజశ్విని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా ఎస్ఎంసీ ఛైర్మన్లు పతాకం ఎగురవేశారు.

రామసముద్రంలో....

రామసముద్రం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించారు. భరతమాత, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూజలు చేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీడీఓ గఫూర్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్ జెండా ఆవిష్కరణ చేశారు. కోలా హరినాథ్ ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది టెన్త్‌లో ఎక్కువ మార్కులు సాధించిన 16మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఊరూ..వాడా... రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

పీలేరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పీలేరు మండల ప్రజలు 79వ స్వాతంత్ర్య దినోత్సవం పండుగ వాతావరణంలో చేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, మాజీ సైనికుల కార్యాలయం, ఆర్టీసీ డిపో, స్వచ్ఛంద సంస్థల కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించారు. కోర్టుల ప్రాంగణలో 11వ అదనపు జిల్లా జడ్జి మహేశ్, ఏజేసీజే శ్రీనివాసులు, అర్బన్ పోలీసు కార్యాలయంలో సీఐ యుగంధర్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శివకుమార్, ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ శివశంకర్, వైఎస్-ఎంపీపీ హరిత, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ హబీబ్, ఆర్టీసీ డిపోలో డీఎం నిర్మల, ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో ఈఈ చంద్రశేఖర రెడ్డి, ఏఎంసీ ప్రాంగణలో ఛైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో ఛైర్మన్ యల్లెల రెడ్డప్పరెడ్డి, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్-రిజిస్ట్రార్ శివకుమారి, ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయంలో అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఛైర్మన్ ఎం.పి. అవినాశ్, ప్రిన్సిపాల్ కేవీఎన్‌వీఎన్ రావు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. శ్రీ భువన విద్యాలయం విద్యార్థులు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. చౌడేశ్వరి ఆలయం వద్ద తొగట వీరక్షత్రియ సంఘం, చేనేత కార్మికులు పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు కరస్పాండెంట్లు వడ్లమూడి మాధవి పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో...

వాల్మీకిపురం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవాలను చేసుకున్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి గురుఅరవింద్, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మనోహర్‌రాజు, పోలీస్ స్టేషన్ వద్ద సీఐ రాఘవరెడ్డి, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ లత, పోస్టాఫీస్ వద్ద పోస్టుమాస్టర్ నిరంజన్‌కుమార్, ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ రవికుమార్, విద్యుత్ సబ్‌స్టేషన్, ట్రాన్స్‌కో కార్యాలయాల వద్ద ఏఈ రాజశేఖర్‌బాబు, రిజిస్టర్ కార్యాలయం వద్ద సబ్‌రిజిస్టర్ స్వరూప్‌కుమార్, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గంగులమ్మ, ఈఓ రవీంద్రనాథ్, మార్కెట్ కార్యాలయంలో ఛైర్మన్ చంద్రమౌళి ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో జాతీయ జెండా ఎగురవేశారు. పాతబస్టాండ్‌లోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. వివిధ పార్టీల రాజకీయ నేతలు, యువత విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలో సీనియర్ సిటిజన్ ఆధ్వ ర్యంలో కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా చేసుకున్నారు.

గుర్రంకొండలో...

గుర్రంకొండ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, సింగిల్ విండో కార్యాలయంలో ఛైర్మన్ మూర్తిరావు జాతీయ జెండాను ఎగురువేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల్లో జెండాను ఎగురువేసి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో నేతలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలకడలో...

కలకడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాలను మండలంలో ఘనంగా చేసుకున్నారు. సింగిల్ విండో కార్యాలయంలో ఛైర్మన్ మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపీడీఓ కార్యాలయంలో జగదీశ్వర్, పోలీస్‌స్టేషన్ సీఐ లక్ష్మన్న జెండాను ఆవిష్కరించారు.



పీలేరు కోర్టులో జెండా వందనం చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు



రాయచోటిలో మంత్రి రాం ప్రసాద్ రెడ్డి నుంచి ప్రశంసా పత్రాలను అందుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి, హౌసింగ్ డీఈ దీన్‌దయాళ్ రాజు - తిరుపతిలో విశిష్ట సేవా అవార్డు అందుకున్న పీలేరు విద్యుత్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి



పీలేరు ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జెండా వందనం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఉపాధిహామీ కార్యాలయంలో ఎగరని జెండా

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉపాధిహామీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాలను నిర్వహించ లేదు. కనీసం మువ్వన్నెల జెండాను కూడా ఎగురవేయ లేదు. అన్ని కార్యాలయాల్లో సంబరాలు చేసుకుంటుంటే ఉపాధి కార్యాలయంలో జెండాను ఆవిష్కరించక పోవడం సిగ్గు చేటని పలువురు విమర్శిస్తున్నారు. కార్యాలయానికి తాళాలు కూడా తీయలేదు. కనీసం కింది స్థాయి ఉద్యోగులనైనా ఏర్పాటు చేసి జెండాను ఎగుర వేసి ఉండాల్సిందనే గ్రామస్తులు అన్నారు. ఇలా నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపర చర్యలు తీసుకుంటే ఇలాంటివి పునరా వృత్తం కాకుండా ఉంటాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



ఉపాధి కార్యాలయానికి తాళాలు కూడా తీయని దృశ్యం

పోస్టులు పెట్టారని.. దాడి - కేసు నమోదు

మదనపల్లె, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పోస్టులు పెడతావా? అంటూ తంబళ్లపల్లె నియోజకవర్గ నేత అనుచరులు, మరో నేత వర్గీయులపై దాడి చేశారు. బాధితుల కథనం మేరకు.. తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి అనుచరులు, అదే నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ అనుచరులపై దాడి చేయడం కలకలం రేపింది. ములకలచెరువు మండలం నాయనవారిపల్లె వాసి కె.సాగర్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శంకర్‌యాదవ్ అనుచరుడిగా, తంబళ్లపల్లె ఐటీడీపీ కన్వీనర్‌గా పనిచేస్తూ, సోషల్ మీడియాలో పార్టీ పోస్టులు పెడుతుంటాడు. ఈ క్రమంలో టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నాని జయచంద్రారెడ్డి వర్గీయులు స్పందిస్తుంటారు. అయితే మాజీ ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి సాగర్‌కుమార్ గురువారం పెద్దమండ్యం వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం సర్పంచి నటరాజ్‌నాయక్‌తో కలిసి బైక్‌లో బయలుదేరారు. అప్పటికే మాటు వేసిన జయచంద్రారెడ్డి అనుచరులు వెంబడించి ఓ ఇంట్లోకి వెళ్లిన వారిని బయటకు తీసుకొచ్చి కర్రలు, రాడ్లతో దాడి చేశారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడతావా? అంటూ కొట్టినట్లు బాధితుడు ఆరోపించారు. వదిలేయమని వేడుకున్నా..వదల్లేదని వాపోయాడు.

గుర్తింపు ఉన్నరైటర్లే డాక్యుమెంట్లు రాయాలి

38 మందికి ఐడెంటీ కార్డులు, సీళ్లు జారీ

మదనపల్లె, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): యూనియన్‌లో గుర్తింపు పొందిన వారే డాక్యుమెంట్లు రాయాలని మదనపల్లె దస్తావేజు లేఖరుల సం ఘం అధ్యక్షుడు రంగు గుణశేఖర్(గుణస్వామి) సూచించారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం డాక్యుమెంట్ రైటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీస అర్హత లేదని వారంతా రైటర్ల పేరుతో డాక్యుమెంట్లు రాస్తూ, అటు అధికారులు, ఇటు ప్రజల ను ఇబ్బందులకు గురిచేయడంతో తప్పుడు పత్రాలతో జరుగుతున్న మోసాలను అరికట్టడానికే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. యూనియన్‌లో గుర్తింపు పొందిన 38 మంది రైటర్లకు ఐడెంటీ కార్డులు, సీలు అందజేశారు. మరో తొమ్మిదిమందిని యూనియన్‌లోకి తీసుకున్నట్లు ప్రకటించారు. వీరికి కూడా ఈనెలాఖరులోగా గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. గౌరవాధ్యక్షుడు రంగు రాజేంద్ర, రైటర్లు సాయిశేఖర్, గణేష్, సాయి, గణేష్‌స్వామి, గుప్తా, ప్యాంటు నాయుడు, పంచి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కేబుల్ దొంగలు అరెస్టు

గుర్రంకొండ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రైతుల వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు కలకడ మండలం కోటగుడి బండకు చెందిన ఎస్.మధు ఆటో నడుపుతూ, జి.గణేష్ వంట మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిందితులిద్దరూ కొంత కాలంగా రైతుల పొలాల్లో ఉన్న బోర్ల వద్ద కేబుల్ వైర్లను చోరీ చేస్తునట్లు చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 5.30 గంటలకు ఎస్ఐ రఘురాం సిబ్బందితో కలిసి తరిగొండ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వాల్మీకీపురం నుంచి తరిగొండ వైపు వస్తున్న నిందితులు పారిపోవడానికి యత్నించారు. వారిని పట్టుకుని విచారించగా పలు గ్రామాల్లో కేబుల్ వైర్లు చోరీ చేసినట్లు తెలిసిందన్నారు. నిందితుల నుంచి 200 మీటర్ల కేబుల్ వైర్, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

'స్త్రీ శక్తి' మహిళలకు వరం

మదనపల్లెలో ప్రారంభించిన సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, ఆర్టీస్టు 15(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆదుకోవడానికి రాష్ట్రప్రభుత్వం స్త్రీ శక్తి పథకం సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటని, శుక్రవారం మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎందరో మహిళలకు లబ్ధిచేకూరుతోందన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాష మాట్లాడుతూ మదనపల్లె వన్, టూ డిపోల పరిధిలో 165 బస్సులు మహిళ కోసం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్లు వెంకటరమణారెడ్డి, అమరనాథ్, టీడీపీ నేతలు నీలకంఠ సిద్దప్ప, జాన్‌బాబు, జేసీబీ మధు, మల్లికార్జున నాయుడు, లక్ష్మన్న, చిప్పిలి చెంగ్రాయుడు, వెంకటరమణారెడ్డి, భాస్కర్, డాన్స్ రెడ్డెప్ప పాల్గొన్నారు.

పీలేరులో స్త్రీ శక్తి సర్వీసులు ప్రారంభం

పీలేరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ప్రవేశ పెట్టిన ఉచిత ప్రయాణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. పీలేరు ఆర్టీసీ బస్టాండులో స్త్రీ శక్తి ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించారు. రాష్ట్ర జంగం కార్పొరేషన్ ఛైర్మన్ వాసునూరి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, పీలేరు డీఎం నిర్మల, ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, ఆర్టీసీ కార్మిక సంఘ నేతలు అమరనాథ రెడ్డి, శ్రీనాథరెడ్డి, టీడీపీ నేతలు కోటపల్లె బాబు, మల్లెల రెడ్డిబాషా, శ్రీకాంత్ రెడ్డి, నల్లారి రియాజ్, పురం రెడ్డమ్మ, సాధన, లక్ష్మీకాంతమ్మ, షమ పాల్గొన్నారు.



స్త్రీ శక్తి సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

ఉచిత బస్సును ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జి

తంబళ్లపల్లె, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న (స్త్రీ శక్తి పథకం) ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం మహిళలకు వరమని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. తంబళ్లపల్లె ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించారు. సీఐ రేవతి, ప్రత్యేకాధికారి అమర్‌నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, తులసీధర్ నాయుడు, పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, సోము, నరసింహులు, బీసీ నేత మాదారపు చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, మాజీ జడ్పీటీసీ సభ్యులు రామచంద్ర, పురుషోత్తం, కుక్కరాజుపల్లె మదన, సుబ్రమణ్యం, వీరాంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా కావళ్ల పండుగ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యంస్వామి ఆలయంలో కావళ్ల పండుగ ఘనంగా జరిగింది. మదనపల్లె పట్టణం, పరిసర ప్రాంతాల భక్తులు కావళ్లు మోస్తూ సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయం చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం నిమ్మనపల్లె రోడ్డులోని సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో కావళ్లను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం, అనురాధలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

విశేషాలంకరణలో కోర్టులో గంగమ్మకు పూజలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మ ఆలయంలో విశేషాలంకరణలో ఆలయకమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయం చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయాన్నే అమ్మవారిని ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం రాహుకాల సమయంలో మహిళలు చీర, జాకెట్లు, పసుపు, కుంకుమ, పొంగళ్లు నైవేద్యంగా తెచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.